**ఈ వారం కథ**


# అప్పుడు...? ఇప్పుడు...?

– జె.సుబ్రహ్మణ్యం

సరిగ్గా ముప్పై ఏళ్ళనాడు జరిగిన సంఘటన చాలా కాకతాళీయంగా – యథాతథంగా జరిగింది ఇప్పుడు.

అదే వేదిక – అదే సందర్భం – అదే సమయం...!

కానైతే – అప్పుడు సీతాపతి నా వెంట వున్నాడు – ఇప్పుడు మనవడు రిషి; ఆనాడు రంగనాయకుల ఆధ్వర్యం; ఈనాడు రంగనాయకులు కొడుకు రాజారావు ఆధ్వర్యం.



నిజమే. మా చిన్నతనం వేరు. పండుగంటే ఆ హడావుడి, ఆ ఆర్భాటం అంతా తీయని స్మృతి. పిండివంటలు, కొత్తబట్టలు రివాజు. ఇప్పుడు ప్రతిరోజూ ఇస్త్రీ బట్టలు....నిత్యం స్వీట్సు! రోజూ పండుగే. బోలెడంత మార్పు వచ్చింది.

అప్పటినుంచీ ఇప్పటివరకూ మా ఖాతాకొట్టు అదే. అసలు రంగనాయకులు కొట్టు అంటే చాలా ప్రసిద్ధి. తరం మారినా పేరు మారలేదు.

వీధి వరండాలో కూర్చుని పేపరు చదువుతున్నాను. లోపల శారద సీతాపతికి చెబుతున్నది. సీతాపతి గడ్డం చేసుకుంటున్నాడు. రిషి ఏడుస్తున్నాడు, కంట్లోకి షాంపు పోయిందని. సీతాపతి కంఠం వినవస్తోంది.

“ఆ... రోజూ తినే గారెలేగా... మరింకేమన్నా చెయ్యరాదూ, పండగ పూటకూడా పాత పిండివంటేనా?' '

“సరే... ఇంకేం చేసుకుంటాం? ఇంకా కొత్త కొత్త వెరైటీలు ఏం వున్నాయి ప్రత్యేకంగా చేసుకోవటానికి? అసలు గారెలు చెయ్యకపోతే పండగకి పరిపూర్ణత ఏం వస్తుంది.”

'నిజమే... మా చిన్నతనం వేరు. పండగంటే దానికో విశిష్టత వుండేది. ఆ హడావుడి – ఆ ఆర్భాటం – అంతా తీయనిస్మృతి. పిండివంటలు – కొత్తగుడ్డలు రివాజు. అలాంటిది ఇప్పుడు... ప్రతిరోజు ఇస్త్రీ బట్టలు – మడత నలగకుండా; కొత్తవో, పాతవో కూడా తెలియటం లేదు. ప్రతి నిత్యం ఏవేవో స్వీట్సు – రకరకాల ఫలహారాలు. రోజూ పండగలానే జరిగిపోతున్నాయి రోజులు. బోలెడంత మార్పు వచ్చింది. చాలా మార్పు! ఒక్క ఇళ్ళకి మావిడాకు తోరణం లేదన్నమాట అటువుంచితే...' దీర్ఘంగా నిట్టూర్చేను నేను.

“కానిచ్చి వెళ్ళిరండి!” శారద చెబుతోంది వాడితో.

“అబ్బబ్బ వుండవే... ప్రాణం తోడేస్తున్నావు. ఎంత లేదన్నా నాకు ఇంకో గంట టైము పడుతుంది' ' నిష్కర్షగా చెబుతున్నాడు సీతాపతి.

“సరి... సరి... మీకు తెమలటం ... తేవటం... నానబెట్టటం... వండటం ... ఇంక జరిగినట్లే...” విసుక్కుంటున్నది శారద.

నేను మళ్ళా పేపర్లో తల దూర్చబోయాను. ఒకడుగు నేను వెళ్ళి వస్తే పోలా అనిపించింది. పేపరు మడిచి కుర్చీలోంచి లేచాను. ఈలోపు శారద రానే వచ్చింది. “మావయ్యగారూ...” అంటూ.

“అంతా విన్నాను... ఆ సంచీ ఇలా తేమ్మా...” బయలుదేరాను. నాతో పాటే చిరంజీవి ప్రయాణ

మైనాడు.

గుండు రంగనాయకుల షాపు కిటకిటలాడుతోంది. పండగ రద్దీ. రాజారావు, గుమాస్తాలు చెమటలు కక్కుతున్నారు. యంత్రాల్లా నవ్వుతూ పనిచేస్తున్నారు. రంగనాయకులు క్యాష్‌తో కూర్చున్నాడు ఇవ్వేళ. నన్ను చూసి పలకరింపుగా నవ్వేడు. నాకో స్టూలు వేశాడు గుమాస్తా.

"మీ పని హాయి పంతులుగారూ చక్కగా రిటైరైనారు. హాయిగా కృష్ణా... రామా అనుకుంటున్నారు చీకూ చింతా లేకుండా. నాకు మాత్రం రిటైర్‌మెంట్ రావడం లేదు..." రంగనాయకులు చెబుతున్నాడు బాధగా.

నిజమే... నేను రిటైరైనాను. రంగనాయకులుకి స్వేచ్ఛ రాలేదు. కారణం అతను ఉద్యోగి కాకపోవడం. వాస్తవంగా చెప్పాలంటే నాకంటే రంగనాయకులే బెటర్. కాస్తో కూస్తో సంపాదిస్తున్నాడు. తన పొట్ట తనే పోసుకుంటున్నాడు సొంత వ్యాపారం కాబట్టి. మరి నేనో... రిటైర్ కాకుండా వుంటే ఎంత బాగుండేదో అనిపిస్తుంది. జీతాలరోజున శారద–సీతాపతి జీతం డబ్బులు ముందేసుకుని – కాగితాల మీద ఖర్చుల కుస్తీలు పడుతూవుంటే మనసు గిజగిజలాడుతుంది. కడుపులో దేవినట్లవుతుంది. అదనవు భారమైపోయానని పేగు మెలివేస్తుంది. పెన్షన్ డబ్బులు బి.పి. బిళ్ళలకి, మందులకే చాలడంలేదు.

"మనవడా..." అడిగేడు రాజారావు.

ఆలోచనల్లోంచి తేరుకుని తల వూపేను చిన్నగా.

"ఆ రోజులే వేరండి పంతులుగారూ! పాపభీతి వుండేది. లంచాలు తినడంలో కూడా ఓ నీతి వుండేది. ముఖ్యంగా అర్థం చేసుకునే మనసుండేది ఆఫీసర్లకి. ఈనాడు డబ్బే ప్రధానమైపోయింది. ఆఫీసరు వస్తున్నాడంటే – ఆంబోతుని చూసిన ఆవుల్లా దడుసుకు సత్తున్నాం" పిప్పరమెంటు బిళ్ళలాంటి రూపాయి బిళ్ళని గల్లాలో వేసుకుంటూ ఆవేదన వెలిబుచ్చాడు రంగనాయకులు.

రిషి... కౌంటర్‌మీద నీటుగా పేర్చిన సీసాల మూతల మీద దరువు వేస్తున్నాడు. వాడి చెయ్యి పట్టుకుని ఆపేను.

రాజారావు వాడివంక నవ్వుతూ చూశాడు. వేరుశనగ గుళ్ళు వున్న సీసా చూపించి తీసుకో అన్నాడు.

> **ఎంతలో ఎంతమార్పు! కేవలం ముప్ఫయిఏళ్ళ వ్యవధిలో ఊహించలేనంత మార్పు. మర్యాదలన్నిటినీ మన్ను చేస్తున్న మార్పు.**

వేయించిన వేరుశనగగుళ్ళు సీసాలో నుంచి పగడాల్లా మెరుస్తున్నాయి. తల అడ్డంగా వూపి... "మీరే పెట్టండి" అన్నాడు రిషి. తక్కువ రాజారావు ముఖంలోని చిరునవ్వు మాయమైంది. రిషి కళ్ళల్లో కాంతి విరిసింది. "తప్పు" మందలించేను నేను. రాజారావు గుప్పెడు తీసి వాడి జేబులో పోశాడు. ఆ పోయడంలో ఏదో అదోలాంటి భావం కదలాడింది.

వీడి ఆగడం మరీ మితిమీరిపోతున్నది. శారదకి చెప్పాలి అనుకున్నాను.

సరిగ్గా ముప్ఫై ఏళ్ళ క్రితం – సీతాపతివి, రంగనాయకులు జీడిపప్పు తీసుకోమంటే, తల అడ్డంగా వూపేడు. ససేమిరా తీసుకోలేదు. నేనేమన్నా అంటానేమో అన్న భయం కావచ్చు – మొహమాటం కావచ్చు – లేకిగా వుంటుందేమోనన్న ఆలోచన కావచ్చు – వీటన్నింటినీ మించి అయాచితంగా తీసుకోవటానికి ఇష్టపడని మనస్తత్వం – గోచరించాయి.

మరి ఇప్పుడు రిషిలో... ఏవన్నా అనుకుంటారేమోనన్న ఇంగితం శూన్యం. భయం అసలు లేకపోవటం. నేనంటేనే కాదు – తల్లీ – తండ్రి – పెద్దలు – గౌరవం లేకపోవటం. ముఖ్యంగా మొహమాటం లేకపోవటం. లేకీ గీకీ జాంతానై!... చాలా నిర్భయత్వం. ఊరికే వస్తే ఏదీ వదలకూడదన్న సిద్ధాంతం!

ఎంతలో ఎంత మార్పు! కేవలం ముప్పై ఏళ్ళ వ్యవధిలో వూహించనంత మార్పు! మర్యాదలనీ మన్ను చేస్తున్న మార్పు!

మాకు పొట్లాలు అందించేడు రాజారావు. డబ్బులిచ్చి లేచాను. "ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోండి పంతులుగారూ..." వెనుకనుంచే రంగనాయకులు ప్రేమగా హెచ్చరించాడు. తలవూపేను. నా కళ్ళు ఎందుకో చెమ్మగిల్లాయి.

దారిలో అడిగేడు రిషి... "తాతయ్యా ఎలా వున్నాయి నా తెలివితేటలు" అంటూ.

"ఏం తెలివితేటలురా ... ఛీ... ఛీ... దిక్కుమాలిన తెలివితేటలు..." మందలింపుగా నేనొక ధోరణిలో అంటే.. దాన్ని తల్లకిందులు చేస్తూ వివరణ ఇచ్చాడు వాడు.

"నీకర్థం గాదులే తాతయ్యా! వాడు నన్ను తీసుకోమన్నాడు.. నేను తీసుకోలేదు. ఎందుకు? నా గుప్పెడు చిన్నది! వాడి గుప్పెడు పెద్దది, అందుకు. ఎటు తిరిగీ ఈవార సరుకులో గుంజుతాడు లాభం..." వాడి ధోరణిలో వాడు చెప్తుకుపోతున్నాడు పడిపడి నవ్వుతూ...

నేను తెల్లబోయాను!

కేవలం పదేళ్ళ వయసులోనే వీడికి ఇన్ని (అతి) తెలివితేటలా? నా మెదడు మొద్దుబారిపోయింది.

ఇల్లు చేరాం!

ఆ మధ్యాహ్నం భోజనాల వేళ శారదకి చెప్పాను విషయం.

శారద వాడివంక అసహ్యంగా చూసింది!

వాడు గునుస్తున్నాడు "నేనేమన్నా అడిగేనా" అంటూ.

సీతాపతి వంక వాళ్ళమ్మ మెచ్చుకోలుగా చూసింది అప్పుడు. ఇప్పుడు శారద రిషివంక అసహ్యంగా చూసింది. అంటే, ఆడవాళ్ళలో, పిల్లల తల్లుల్లో మార్పురాలేదు. తన కొడుకు ఆత్మాభిమానం కలవాడుగా వుండాలనే కోరుకుంటున్నారు. వచ్చిన మార్పల్లా కొడుకుల్లోనే!

సీతాపతి మౌనంగా వుండిపోయాడు అప్పుడు.

భోజనాలైపోయాక... చెప్పాడు సీతాపతి... "పుట్టుకతోనే ఇలాంటి తెలివితేటలు వస్తున్నాయి నాన్నగారూ ఈ నీరు – ఈ గాలి – ఈ సొసైటీ పోకడ దోహదం చేస్తున్నాయి. మీ తరంలో మా గురించి మీరంతా దిగులుపడేవాళ్ళు 'ఎలా బతుకుతార్రా వీళ్ళం'టూ. కానీ మాకా దిగులు లేదు. బాధా లేదు. ఎందుకంటే మాకంటే హాయిగా వాళ్ళ తరం బ్రతుకుతారు. ఏ సమస్యనైనా వళ్ళు తోముకున్నంత తేలిగ్గా కడిగేసుకోగలరు వాళ్ళు. తెలివితేటలు అలాంటివి. కానీ... మా ఆందోళన ఒక్కటే – ఈ స్పీడు వాళ్ళ ఆయువు మీద ఎంత స్పీడుగా పనిచేస్తుందోనని."

అవును. సీతాపతి చెప్పింది అక్షరాలా నిజం! కానైతే సీతాపతికి జవాబు ఆలోచించుకోవటానికి ఇంత వ్యవధి కావల్సి వచ్చింది. అసలు పాల పీకలోనే లౌక్యం నిండి వుంది! పీల్చేగాలిలో స్వార్థం నిండి వుంది!! చూచే వెలుగుని కోటి రంగులుగా విడదీయగల నేర్పు రిషి తరంలో వుంది.